



ఆంధ్రా భద్రాద్రిలో వైభవంగా..

ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచిన కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లలమామిడాడ కోదండరామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఆదివారం వైభవంగా సాగాయి.. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.. జైశ్రీరామ్ నినాదాలతో ఆలయం మార్మోగింది.. సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. స్వామి అమ్మవార్లకు కలెక్టర్ షన్‌మోహన్, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. -7లో





సంప్రదాయ దుస్తుల్లో ఎస్పీ దంపతులు



రాజమండ్రి సీతంపేట రామాలయంలో సీతారాముల కల్యాణం



మంత్రిగారూ.. మారారు : పంచెకట్టులో మంత్రి దుర్గేష్



కడియం మండలం వీరవరంలో పూజలు

ఊరూరా రాములోరి.. కల్యాణం

జిల్లా వ్యాప్తంగా రాములోరి కల్యాణం ఘనంగా సాగింది.. ఊరూవాడా రామాలయాల వద్ద ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా సాగింది. రాజమహేంద్రవరం జాంపేట రిజర్వ్ పోలీస్ లైన్ కోదండ రామాలయంలో జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ లావణ్య దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. ఎస్పీ మాతృమూర్తి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్‌బీ సీఐ ఏ.శ్రీనివాసరావు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.ర ఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయి మహేష్, జి.వెంకటేశ్వరరావు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. - రాజమహేంద్రవరం సిటీ



సీసీ.. చూసీ!

కేసుల ఛేదనలో బ్రహ్మాస్త్రం..సీసీ కెమెరాలు

- చూస్తున్నాయ్.. కనిపెట్టేస్తున్నాయ్
- అయినా ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం
- సర్కారుకు సీసీ కెమెరాలు కరువు
- ఉమ్మడి జిల్లాలో సుమారు 1520
- ఎక్కడికక్కడ పాడైపోతున్న వైనం
- ప్రైవేటు సీసీ కెమెరాలపైనే ఆధారం
- జాతీయ రహదారిలో దారుణం
- జొన్నాడ టూ అన్నవరం 121
- మరిన్ని ఏర్పాటుకు డిమాండ్

గత నెల 24న జరిగిన పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి ఎన్నో సంచనాలకు వేదికైంది.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది..ఆ ఘటనకు సీసీ కెమెరాలే దాదాపుగా చెక్ పెట్టాయి.ఆయన అదే రోజు హైదరాబా ద్ నుంచి బుల్లెట్‌పై సుమారు 400 కిలోమీటర్లు పైనే ప్రయాణించారు. ఆ ఘటనపై క్రైస్తవులంతా ఏకమయ్యారు. పాస్టర్‌ను హత్య చేశారంటూ గొంతెత్తారు.. ఎవరికి వారు రకరకాల వాదనలు వినిపించారు. పోలీసులు దర్యాప్తు ఆరంభించారు.. సీసీ అస్త్రం బయటకు తీశారు.. ఆయన ప్రయాణించిన దారిలో సుమారు 300 సీసీ కెమెరాలు పరిశీలించారు.. ఏం జరిగిందో చెప్పడానికి ప్రయత్నించారు. అల్లర్లను చల్లార్చారు. అసలు సీసీ కెమెరాలే లేకపోతే దర్యాప్తు ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడని పరిస్థితి ఉండేది. నిఘా నేత్రాల వల్ల ఆ కేసులో దాదాపుగా చిక్కుముళ్లు వీడినట్టు సమాచారం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సీసీ కెమెరాల ఏర్పాటులో ఇటు యంత్రాంగం, అటు జనంలోనూ అలసత్వం కనబడుతోంది. సర్కారు వారి కెమెరాలను రకరకాల దోషాలు పట్టిపీడిస్తుంటే.. ప్రజలు వాటిని ఏర్పాటు చేసుకోవడంపై విముఖత చూపుతున్నారు.



చిల్లకల్లు వద్ద రోడ్డుపై పడిపోయిన ప్రవీణ్ (ఫైల్)

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ/క్రైం-ఆంధ్రజ్యోతి)

నవాలక్ష సమస్యల పరిష్కారంలో కీలక భూమిక వహిస్తున్నది 'నిఘా' నేత్రమే. నేరాల దర్యాప్తు, నియంత్రణలో మూడో కన్ను అత్యంత కీలకంగా మారింది.అధిక దర్యాప్తులు సీసీ కెమెరాల ఆధారంగానే ఓ కొలిక్కి వస్తున్నాయి. పలు కీలకమైన కేసుల్లో సీసీ కెమెరాల పుటేజీలు లభ్యత వల్ల ఏళ్ల పాటు సాగాల్సిన దర్యాప్తులు వేగంగా జరిగి నేరస్తులను జైలుకు పంపిస్తున్నాయి. నేర నియంత్రణలో సీసీ కెమెరా పుటేజీలు కీలకంగా ఉన్నా ఏర్పాటులో కరువు కనబడుతోంది.తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో కనీసం 5 వేల కుపైనే సీసీ కెమెరాలు ఉండాలి. మరో రెండేళ్లలో పుష్కరాలు రానున్నాయి.కానీ ప్రస్తుతం 375 కెమెరాలు ఉండగా..కేవలం 185 పనిచేస్తున్నాయి. అధికారికంగా 480 కెమెరాలు ఉన్నాయని లెక్క చెబుతున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 150 సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిలో 15 కెమెరాలు సాంకేతిక ఇబ్బందుల వల్ల పనిచేయడం లేదు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌లో 10 మంది సిబ్బంది షిఫ్టుల వారీగా పనిచేస్తూ ఈ కెమెరాల పుటేజీని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నగరంలో ప్రస్తుతం 320 సర్కారు కెమెరాలు మాత్రమే విధుల్లో ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పోలీసు యంత్రాంగం ఎన్నో కీలకమైన కేసులను ఛేదించింది. కోనసీమ జిల్లా పరిధిలో పోలీసుల రికార్డుల ప్రకారం 2వేలకు పైనే సీసీ కెమెరాలు ఉన్నాయి. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 3,622 సీసీ, పీటీజెడ్ కెమెరాలు ఉన్నాయి. జిల్లా పోలీస్‌శాఖకు సంబంధించి 540 సీసీ, పీటీజెడ్ కెమెరాలుండగా పోలీస్‌శాఖ 16 డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసింది. ఈ కెమెరాలు నిరంతరాయం పని చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 10 వేల సీసీ కెమెరాలు ఏర్పా టు చేస్తే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావు లేకుండా జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని రూపొందించవచ్చని ఎస్పీ బింధుమాధవ్ ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సంఘటన జరిగిన సమయంలో ప్రైవేటు కెమెరాలపై ఆధారపడాల్సి వస్తోంది.శివారు, సమ స్యాత్మక ప్రాంతాల్లో నిఘానేత్రాలు మసక బారిపోయాయి.

పోలీస్ కెమెరాలకు మ్యాట్రిక్స్

పోలీస్ సీసీ కెమెరాలను మ్యాట్రిక్స్ సంస్థకు అప్పగించారు. కెమెరాల ఏర్పాటు, పర్యవేక్షణ, మరమ్మతులు ఆ సంస్థ చూడాల్సి ఉంది. కానీ ఆ సంస్థ అలసత్వం వల్ల కెమెరాల పనితీరు రోజు రోజుకూ మందగిస్తోందని చెబుతున్నారు. మ్యాట్రిక్స్ సంస్థకు విజయవాడలో సర్వర్ ఉంది. సీసీ పుటేజీ 3 రోజుల వరకూ జిల్లా పోలీసు కార్యాలయంలో నిక్షిప్తమై ఉంటుంది.తర్వాత 28 రోజుల వరకూ మ్యాట్రిక్స్ వద్ద ఉంటుంది.మూడు రోజుల తర్వాత ఏదైనా పుటేజీ అవసరమైతే కెమెరా ఐపీతో లెటర్ రాసి మ్యాట్రిక్స్ వద్ద నుంచి తీసుకోవాలి. 28 రోజులు దాటితే సీసీ పుటేజీ ఉండదు.

హైవేపై.. సేఫ్ వేనా..

జాతీయ రహదారిపై ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలోని సీసీ కెమెరాల పుటేజీ సేఫ్‌వే సంస్థ వద్ద 30 రోజుల వరకూ ఉంటుంది. ఆ గడువు ముగిస్తే పుటేజీ దొరకదు. ఏదైనా ప్రమాద ఘటనలు ఉంటే ఆ పుటేజీని జాగ్రత్త పరు స్తున్నామని చెబుతున్నారు.ఎంతో ప్రాధాన్యత ఉన్న సీసీ కెమెరా పుటేజీలకు ప్రభుత్వం ఎందుకు సర్వర్లు ఏర్పాటు చేయడం లేదనేది ప్రశ్నగానే మిగులుతోంది.

హై..వే పట్టదా!

జాతీయ రహదారిపై సీసీ కెమెరాలపై తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. జాతీయ రహదారిపై కిలోమీటరుకు ఒకటి చొప్పున జొన్నాడ నుంచి రాజమహేంద్రవరం వరకూ 49, దివాన్ చెరువు నుంచి-అన్నవరం వరకూ 72 కెమెరాలు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ సేఫ్‌వే సంస్థ చూస్తోంది. అయితే హైవే మరమ్మతులు, జొన్నాడ దగ్గర జరుగుతున్న ఫ్లైఓవర్ వంటి పనులు చేస్తున్నప్పుడు వైర్లు తెగిపోవడంతో రోజుల తరబడి సమస్య వస్తోంది. జొన్నాడ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల వల్ల సుమారు 40 కెమెరాలు పని చేయడం లేదు. ఇలాంటి పరిస్థితి వల్ల ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాథమికంగా నిజ నిర్ధారణ అత్యంత కష్టంగా మారుతోంది.

కాకినాడలో సీసీసీ నిరుపయోగం..

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ నిఘా నేత్రానికి విఘాతం కలిగింది.కాకినాడ స్మార్ట్ సిటీగా ఎంపికైన తర్వాత మొదటిగా కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)ను తలపెట్టింది. కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాజెక్టు 2017లో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులు రూ.90 కోట్లతో చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 71 ప్రాంతాల్లో 350 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ బాధ్యతలను సెర్బిలైట్ సంస్థకు 2019లో అప్పగించారు. నెలకు రూ.50 లక్షల చొప్పున ఏడాదికి రూ.ఆరు కోట్లు చొప్పున ఐదేళ్ల పాటు రూ.30 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడేళ్లుగా సంస్థకు చెల్లించాల్సిన రూ.19.50 కోట్ల బిల్లుల బకాయిలు స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ చెల్లించలేదు. నిర్వహణ భారంగా మారడంతో నిర్వాహకులు అగ్రిమెంట్ మధ్యలోనే బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఈ సెంటర్‌లో 35 మంది పనిచేసేవారు. సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నిరుపయోగంగా మారింది. కార్పొరేషన్ అధికారులు కమాండ్ కంట్రోల్ సెంటర్ పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీలు చూశాయ్..పట్టించాయ్..

- రాజమహేంద్రవరంలో వరుస చైన్ స్నాచింగ్‌లతో హడలెత్తించిన దొంగోడి ఆటకు సీసీ కెమెరాలు చెక్ పెట్టాయి. రెండేళ్ల కిందట బొమ్మూరులోని ఇంట్లో నిద్రిస్తున్న ఓ వృద్ధురాలిపై యువకుడు అత్యా చారం చేశాడు.ఈ కేసులో సీసీ కెమెరాలే నేరస్తుడిని కటకటాల్లోకి నెట్టాయి.
- అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో జరిగిన భారీ దోపిడీ కేసును సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సెల్‌ఫోన్ టెక్నాలజీ, సీసీ కెమెరాల ద్వారా గుర్తించి భారీ ఎత్తున రికవరీ చేశారనడానికి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.
- 2022 నవంబర్‌లో కాకినాడ జిల్లా తునిలో టీడీపీ నాయ కుడు, మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావుపై కత్తితో దాడి చేసి బైక్‌పై ఉడాయించిన నిందితుడిని ఇంటి వద్ద ఉన్న సీసీ పుటేజీ ఆధారంగా పట్టుకున్నారు..
- గత వైసీపీ ప్రభుత్వంలో దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని చంపి ఎమ్మెల్సీ అనంతబాబు డోర్ డెలివరీ చేసిన కేసులోనూ సీసీ కెమెరాలే కీలకంగా మారాయి. ఆ హత్యకు ముందు ఆ దళిత యువకుడిని అనంతబాబు ఎలా తీసుకువెళ్లాడో సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. వాటి ఆధారంగా కేసు వెలుగులోకి వచ్చింది.ఇలా ఒకటేమిటి నేరాలకు సంబంధించిన ఏ కేసులోనైనా సీసీ కెమెరాలే కీలకంగా మారాయి.



డీఎస్సీకి.. వేళాయె!

ఈ వారంలోనే నోటిఫికేషన్?

- విద్యాశాఖ సన్నాహాలు
- ఉమ్మడి జిల్లాలో 1278 ఖాళీలు
- నిరుద్యోగుల ఎదురుచూపులు
- ఎస్సీ వర్గీకరణతో నిలుపుదల
- రోస్టర్ పాయింట్లు వస్తే ప్రకటన

కాకినాడ రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : త్వరలోనే కొలువుల జాతర మొదలు కానుంది. ఈ వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లు రాగానే నోటిఫికేషన్ విడుదల చేయనుంది. వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే దీని కోసం కొన్ని లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ,జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఇచ్చిన ప్రధాన హామీల్లో ఇదొకటి. ప్రస్తుతం దీని అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఇప్పటికే టెట్ పూర్తి

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని విస్మరించింది.అంతకుముందు ఎన్నికల హామీల్లో ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే ఆ ఊసే మరిచింది. దీంతో నిరుద్యోగ అభ్యర్థులకు ఆ ఐదేళ్లూ ఎదురు చూపులే మిగిలాయి.2024లో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347కుపైగా ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించి ఇప్పటికే ఫలితాలు ప్రకటించింది.

ఈ ఫలితాలు నవంబరులోనే విడుదల కావడంతో అదే నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని అభ్యర్థులంతా భావించారు. అప్పటికే చాలా మంది అభ్యర్థులు కోచింగ్ తీసుకుంటూ డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కొన్ని సాంకేతిక కారణాలు, ఎమ్మెల్సీ కోడ్ అమలుతో పాటు అభ్యర్థుల వయసు పెంపు తదితర సమస్యలపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున నోటిఫికేషన్ ప్రకటన వాయిదా పడింది. ఆ సమస్యలన్నింటినీ సరిచేసి కోడ్ ముగిసిన తర్వాత నోటిఫికేషన్ వెలువరిస్తారని ఆశించారు.ప్రస్తుతం నిరుద్యోగులకు మంచి రోజులు వచ్చాయి. తాజాగా సీఎం చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేశ్ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాల్లో ఏప్రిల్‌లోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఆ ప్రక్రియ మొత్తం జూన్ కల్లా పూర్తి చేస్తామని తెలిపారు.ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఆ దిశగా అడుగులు వేస్తుండడంతో అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖాళీలివే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1,278 ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్టు సమాచారం. స్కూల్ అసి స్టెంట్లకు సంబంధించి ఆంగ్లం 90, తెలుగు 70, హిందీ 71, గణితం 55, ఫిజికల్ సైన్స్ 59, బయాలాజికల్ సైన్స్ 95, సోషల్ స్టడీస్ 114, సంస్కృతం 5,వ్యాయామ విద్య 199, ఎస్జీటీలు 349, పీజీటీ, టీజీటీ ప్రిన్సిపాల్స్ మొత్తం 171 ఖాళీలు డీఎస్సీ ద్వారా భర్తీ కానున్నట్టు తెలిసింది.మరో వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేష న్ వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఉ మ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల మం దికి పైగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

వర్గీకరణ పాయింట్లు రాగానే..

ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లు రాగానే నోటిఫికేషన్ విడుదల చేయడానికి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఆర్డినెన్స్ జారీ కాగానే సాధారణ పరిపాలన శాఖ రిజర్వేషన్లపై కొత్త రోస్టర్ విడుదల చేస్తుంది. దానికి అనుగుణంగా పోస్టులు కేటాయించి, నోటిఫికేషన్ విడుదల చేస్తారు. రోస్టర్ పాయింట్లు విడుదలైన మరుసటి రోజు లేదా ఆ తర్వాత రోజు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలవుతుంది.వర్గీకరణ ప్రక్రియ దాదాపు పూర్తికావడంతో నోటిఫికేషన్‌కు మార్గం సుగమమైంది.



శోభాయాత్రలో జనవాహిని.. హాజరైన ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వాసు, బత్తుల.. ప్రసంగిస్తున్న స్వామి విరజానంద

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ యథాతథం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు.ఉన్నతాధికారుల తప్పక హాజరుకావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

హిందువులు చైతన్యవంతంగా ఉండాలి

స్వామి విరజానంద - ఘనంగా శ్రీరామ శోభాయాత్ర

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : హిందువులందరూ,నిత్య చైతన్యవంతంగా ఉండాలని కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన స్వామి విరజానంద, అఖిల భారత ధర్మజాగరణ ప్రముఖ్ ఆలే కుమార్ పిలుపునిచ్చారు.శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పుష్కర్ ఘాట్ నుంచి శోభాయాత్ర కోలాహలంగా సాగింది. హిందూ సమాజం నిద్రాణం నుంచి మేల్కోవాలన్నారు. మనం అంతా సంఘటితంగా లేకపోతే ఎలాంటి ప్రమాదాలు పొంచి ఉంటాయో కొన్ని సంఘటనలు ఉదహరిస్తూ వివరించారు.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ వెయ్యేళ్ళుగా నిద్రాణంలో ఉన్న మన హిందూ జాతి ఇప్పుడిప్పుడే మేల్కొంటుందన్నారు. గడచిన వందేళ్లుగా హిందూ జాగరణకు చేస్తున్న ప్రయత్నం ఇప్పుడు మంచి ఫలితాలనిస్తుందన్నారు. శ్రీరామ శోభా యాత్ర.. జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగింది. బైక్‌లపై యువత, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. శ్రీరామ సేవా సమితి అధ్యక్షుడు పతివాడ రామరాజు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా శోభాయాత్ర జరుపుతున్నా మ న్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్య క్షురాలు,ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మె ల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యకారిణి ఓలేటి సత్యనారాయణ, రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, జనసేన సిటి ఇన్‌చార్జ్ అనుశ్రీ సత్యనారాయణ, రాజమండ్రి బిజెపి కన్వీనర్ యెనుముల రంగబాబు,హీరాచంద్ జైన్, తదితరులు పాల్గొన్నారు.

211 మంది సెక్రటరీల నియామకం

గ్రేడ్-5 సెక్రటరీలకు గ్రేడ్ -4 ఉద్యోగులుగా పదోన్నతి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీల పాలన మెరుగుపడనుంది. జిల్లా వ్యాప్తంగా చాలా పంచాయ తీలు ఇప్పటి వరకూ ఇన్‌చార్జిల పాలనలో కొనసాగాయి. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిన సంగతి తెలిసిందే. తెలుగుదేశం ప్రభుత్వం స్థానిక పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒక్కో పంచాయతీకి ఒక్కో సెక్రటరీ ఉండేలా ప్రయ త్నాలు ఆరంభించింది. సచివాలయ ఉద్యోగు లుగా గ్రేడ్-5 స్థాయిలో చేరిన సెక్రటరీలకు గ్రేడ్-4కు పదోన్నతి కల్పించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 211 మంది ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వడంతో పాటు వారికి వివిధ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నోడల్ ఆఫీసర్, కాకినాడ కలెక్టర్ షన్ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి వీరికి మార్చిలోనే పదోన్నతులు లభించాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. ఇటీవల వీరందరికీ పదోన్నతులు ఇచ్చి పోస్టింగ్‌లు ఇచ్చారు.వీరిలో అనేక మందిని ఏజెన్సీ గ్రామాలకు సెక్రటరీలుగా నియమించారు. కొంత మందిని తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో నియమించారు. ఇప్పటికే చాలా మంది రిలీవ్ అయ్యారు. వారంతా సోమవారం నుంచి కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరిస్తారు. కొంత మంది సోమ, మంగళవారాల్లో రిలీవ్ కానున్నారు.

ఇష్టపడిన మహిళ తనతో ఉండనందని ఆత్మహత్య?



సీతానగరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇష్టపడిన మహిళ తనతో పాటు ఉండనందని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామచంద్రపురం గ్రామానికి చెందిన వేమగిరి సునీల్ (26)కు గతంలో వివాహమైంది. మనస్పర్థలు రావడంతో భార్య సునీల్‌పై కేసు పెట్టింది. ఇదిలా ఉండగా వరుసకు మరదలైన ఒక మహిళతో పరిచయం ఏర్పడింది. శ్రీరామ నవమి నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్ నుంచి సీతానగరం చేరు కుని సునీల్‌ను కలిసింది. అనంతరం ఇరువురు కలిసి శ్రీరామనగర్‌లోని రాజుగారి గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌కు వెళ్లి ఉదయం 9 నుంచి సాయం త్రం వరకు అక్కడే ఉన్నారు. తనతో పాటు ఉన్న మహిళను పర్మినెంట్‌గా ఉండిపోవాలని సునీల్ కోరాడు. ప్రస్తుతం కేసు నడుస్తోంది కదా అలా చేయడం తప్పని చెప్పి బాత్‌రూంకు వెళ్లి వచ్చే లోపు సునీల్ ఉరివేసుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న సునీల్‌ను పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు సిబ్బంది తెలిపారు. మృతుడి బంధువులు రాగానే మహిళ వెళ్లిపోయినట్టు కుటుంబీకులు తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామ్‌కుమార్ తెలిపారు. మృతుడికి తండ్రి అబ్బులు, తల్లి శాంతి, సోదరి స్వప్న ఉన్నారు.




గొల్లల మామిడాడలో కోదండరాముడు, సీతాదేవిలకు సమర్పించిన కొబ్బరి బొండాలు... అమ్మవారికి ధరింపజేసే మాంగల్యాన్ని చూపిస్తున్న అర్చకస్వామి

కల్యాణ వైభోగమే

కనుల పండువగా కోదండరాముని కల్యాణ మహోత్సవం

రామనామస్మరణతో మార్మోగిన గొల్లల మామిడాడ

సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దంపతులు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు



తలంబ్రాలు బియ్యంపై మూడు భాషల్లో రాసిన రామనామం

కాకినాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోదండ రాముడి కల్యాణ వేడుకతో కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీరామనవమి పర్వదినాన జరిగిన సీతారాముల కల్యాణోత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించారు. ఈ ఊరంతా రామనామస్మరణతో మార్మోగింది. కోరిన కోర్కెలు తీర్చే కోదండరాముడిని భక్తులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆంధ్రా భద్రాద్రిగా పేర్గాంచిన ఈ ఆలయంలో ఆదివారం ఉదయం నుంచే సీతారాముల దర్శనానికి అనుమతిచ్చారు. శనివారం రాత్రికే పెద్ద ఎత్తున భక్తులు మామిడాడ చేరుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం పుష్కరిణి వద్ద ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వివాహం కానివారు స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి పెళ్లి తలంబ్రాలను శిరస్సుపై ధరించారు. సంతానం లేని దంపతులు స్వామివారిని దర్శించుకుని సంతానప్రాప్తి కలిగించాలని వేడుకున్నారు. స్వామి అనుగ్రహంతో సంతానం కలిగిందని నమ్మిన దంపతులు పుట్టిన పిల్లలను తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ దంపతులు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి మంచి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. జి.మామిడాడ గ్రామానికి చెందిన ద్వారంపూడి యువరాజారెడ్డి కొబ్బరి బొండాలు, బియ్యపు గింజలపై మూడు భాషల్లో రాసిన రామనామ తలంబ్రాలను అందజేశారు. చైత్ర శుద్ధ నవమి ఆదివారం ఉదయం 11.30 గంటలకు సీతారాముల విగ్రహాలను కల్యాణ వేదికపైకి వేదపండితులు తీసుకొచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కల్యాణ ఘట్టం ప్రారంభమైంది. జీలకర్ర-బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు క్రతువులను అర్చకస్వాములు శాస్త్రోక్తంగా జరిపించారు. రాష్ట్రం నలుమూలాల నుంచి తరలివచ్చిన భక్తులు కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. పుష్కరిణి వద్ద ఉచితఅన్నదానం నిర్వహించారు.



శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో కోదండరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు



కల్యాణాన్ని తిలకిస్తున్న అశేష భక్తజనం



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

వెంకన్న కల్యాణానికి వేళాయె...

- నేటి నుంచి వాడపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు
- వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- రేపు తీర్థం, రథోత్సవం, కల్యాణం

ఆత్రేయపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దివ్యకల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు చురుకుగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 13 వరకూ నిర్వహించే కల్యాణోత్సవాలకు కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో రెండు దఫాలు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్న దృష్ట్యా భక్తుల సౌకర్యాలపై సమీక్షించి ఆ దిశగా ఏర్పాట్లు చేపట్టాలని అధికార యంత్రాగాన్ని ఆదేశించారు. 7 దశమి సోమవారం స్వామివారి ధ్వజారోహణ, నిత్యబలిహరణ, 8న ఏకాదశి మంగళవారం స్వామివారి తీర్థం, రథోత్సవం, రాత్రి కల్యాణం, 9 ద్వాదశి బుధవారం స్వామివారి పొన్నవాహన మహోత్సవం, 10 త్రయోదశి గురువారం సద్యసం, చతుర్ధశి శుక్రవారం గౌతమి గోదావరి నదీలో తెప్పోత్సవం, 12 పౌర్ణమి శనివారం మహా పూర్ణాహుతి, చక్రస్నాన మహోత్సవం, 13 పాడ్యమి ఆదివారం స్వామివారి శ్రీపుష్పయాగముతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి. వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవల్లి రాజేశ్వరప్రసాద్ చార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.



స్వామివారి రథానికి మెరుగులు దిద్దుతున్న దృశ్యం

వార్షిక ఆదాయం రూ.30 కోట్లు

గతేడాది గ్రేడ్-1 స్థాయి కలిగిన ఈ ఆలయం డీసీ హోదాకు చేరుకుంది. స్వామివారి వార్షిక ఆదాయం రూ.30 కోట్లకు చేరుకుంది. అన్నదాన విరాళాలు రూ.10కోట్లు పైమాటే. దాతల సమకూరుస్తున్న విరాళాలతో పుణ్యక్షేత్రం విరాజిల్లుతుంది.

ఆలయాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల్లోనే పాలకులు ఆలయాభివృద్ధిపై దృష్టిపెట్టారు. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోంది. ప్రతి శనివారం 50 వేలకు పైనే భక్తులు తరలివస్తున్నారు. ఆలయ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించింది. ఆ దిశగా అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. రహదారులు పార్కింగ్ ప్రహరీ, టాయిలెట్లు, సీసీ రోడ్లు, గోశాల నిర్మాణం, తాత్కాలిక అన్నదాన షెడ్‌కు టైల్స్, ప్లైఓవర్ తదితర నిర్మాణాలు వేగవంతంగా చేపడుతున్నారు.

స్వామివారి చరిత్ర...

స్వయంభూ ఎర్రచందన మనే కొయ్యవిగ్రహంతో మూర్తిభవించిన పరందాముడు ఈయన. ఇటువంటి విగ్రహం భారత దేశంలో మరెక్కడ లేదు. పూర్వం గౌతమి గోదావరి నదీలో ఓ చందనం పెట్టే లభ్యమైంది. ఋషి పుంగవులతో అలరాలుతున్న ఆ ప్రాంతంలో ఈ చందనం పెట్టే లభించడంతో గ్రామస్తులు ఆ విగ్రహాన్ని మేళతాళ మంగళవాయిద్యాలతో తీసుకొచ్చి ప్రతిష్ఠించిన్నట్టు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. అలనాడు నాటి నౌకపురి పినపోతు గజేంద్రుడు సముద్రంలో తమ ఓడలు కొట్టుకుపోయాయి. ఓడలన్ని సురక్షితంగా వస్తే ఆలయం నిర్మిస్తామని స్వామివారిని వేడుకున్నారు. ఓడలన్ని క్షేమంగా ఒడ్డుకు చేరడంతో దేవాలయం నిర్మించినట్టు చరిత్ర చెబుతుంది. అనంతరం స్వామి విశిష్టతను తెలుసుకున్న నాటి సంస్థానదీసులు వత్సవాయి తిమ్మగజపతి మహారాజు స్వామిని దర్శించుకున్నారు. దూపదీప నైవేద్యాల నిమిత్తం 275 ఎకరాలు, స్వామివారి సేవకుల మాన్యాలకు 110 ఎకరాలు భూములు విరాళంగా అందించారు. 7 శనివారాల వెంకన్న దర్శనం 7 జన్మల పుణ్యఫలంగా భక్తులు తరలి వస్తున్నారు.



వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు



ఆలయాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించాం. ఆలయ ఎదురుగా కోనేరు నిర్మాణం, 3 వేలమంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించేలా భవన నిర్మాణం, డార్మేటరి, వసతిగృహాల నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం రూ.10కోట్లతో వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా రూపొందిస్తున్నాం.

\- బండారు సత్యానందరావు, ఎమ్మెల్యే, కొత్తపేట

ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి



జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కల్యాణోత్సవ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాం. చూడచక్కని కల్యాణ వేదిక, భక్తులకు ఎండ వేడి తగలకుండా మజ్జిగ చలివేంద్రాలు, పాలు, బిస్కెట్లు, అన్నసమారాధన చేపడతాం. వివిధ శాఖలకు చెందిన అధికారులు భాగస్వామ్యంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపడుతున్నాం.

\- నల్లం సూర్యచక్రధరరావు, ఉపకమిషనరు, వాడపల్లి దేవస్థానం

అంగరంగ వైభవంగా...

ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణం




జగన్మోహిని కేశవస్వామి కల్యాణ దృశ్యం, తిలకిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమజిల్లాలో పురాతన ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి దివ్యకల్యాణ మహోత్సవం నవమి ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి మేల్కొపు సేవ, నిరాజన మంత్రపుష్పం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గరుడ వాహన సేవ మేళతాళ మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. వందలాది మంది కేశవదీక్షదారులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సుందరంగా పుష్పాలతో అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు స్వామి,అమ్మవార్లను తీసుకువచ్చి కల్యాణ తంతును నిర్వహించారు. వేదపడింతులు ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీనివాసుల వెంకటాచార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని భక్తిశ్రద్ధలతో తిలకించారు. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయ ఈవో బీహెచ్వీ.రమణమూర్తి దంపతులు స్వామివారికి సమర్పించారు. విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో

సత్యదేవుని ఆదాయం రూ.142.89 కోట్లు

- వ్యయం 147.53 కోట్లు
- రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు.. కానరాని మిగులు

అన్నవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ విభాగాల ద్వారా రూ.142,89,13,196 ఆదాయం సమకూరగా వివిధ పద్దుల కింద రూ.147,53,85,371 వ్యయం చేసినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆదాయ మార్గాల్లో వ్రతం టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.38.39 కోట్లు, ప్రసాదాల విక్రయాల నుంచి రూ.33.06 కోట్లు, భక్తుల హుండీల్లో సమర్పించిన కానుకల నుంచి రు.18.79 కోట్లు, వివిధ షాపుల లైసెన్స్ అద్దెల నుంచి రూ.15.76 కోట్లు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.5.49 కోట్ల ఆదాయం లభించింది. వివిధ పద్దుల ద్వారా వ్యయాన్ని పరిశీలిస్తే ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా ఉంది. దీనికి ప్రధాన కారణం భక్తుల సౌకర్యాలకు రూ.12.74 కోట్లతో పలు నిర్మాణాలు చేపట్టడంతో సుమారు రూ.5 కోట్ల వ్యత్యాసం కనిపించిందన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల జీతాలకు రూ.23.35 కోట్లు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రూ.13.79 కోట్లు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు రూ.8.10 కోట్లు, నాయీ బ్రాహ్మణులు, వ్రత పురోహితులు ఇతరులకు రెమ్యునరేషన్ రూపంలో రూ.15.97 కోట్లు, ఎస్‌పీఎఫ్ భద్రతా సిబ్బందికి, సెక్యూరిటీ గార్డుల జీతాలకు రూ.4.35 కోట్లు, ప్రసాదం తయారీకి ముడిసరుకు కొనుగోలుకు రూ.23.17 కోట్లు వ్యయం చేశారు. రూ.12.74 కోట్లు వివిధ నిర్మాణాలు చేపట్టినందుకు చెల్లింపులు చేశారు. విద్యుత్, వాటర్‌వర్క్స్ సంబంధించి రూ.4.53 కోట్లు వ్యయం చేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

WANTED

★ ఓవర్సీస్ హోం కేర్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని / వంట పనిచేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph.: 99120 11499, 99120 11899. AJH-003142

4 Lines CLASSIFIED Rs.230/- Only

రెజ్లింగ్ చాంపియన్‌షిప్ విజేత 'విజయవాడ'

రన్నర్‌గా కాకినాడ జట్టు



విజేతగా నిలిచిన విజయవాడ జట్టు సభ్యులు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్, ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్-2025 ఆదివారం ముగిసింది. విజయవాడ జట్టు విన్నర్‌గా నిల్చి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించిందని చార్టర్ ప్రెసిడెంట్ తీగెల రాజా, ప్రెసిడెంట్ వెంకట్ ఇమ్మాణ్ణి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొని జాతీయ స్థాయి చాంపియన్ షిప్‌లో అర్హత కోసం పోటీపడ్డారు. కాగా అండర్-20, అండర్-15లో విన్నర్‌గా విజయవాడ పల్నాడు జట్టు నిలిచి ఓవరాల్ చాంపియన్ సాధించింది. రన్నర్‌గా కాకినాడ జట్టు నిలిచింది. విజేతలు ఈ నెల 23న రాజస్థాన్‌లోని కోటాలో జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారని తీగెల రాజా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ ముత్యాలు, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ సెక్రటరీ సురేష్ ఉదయగిరి, కార్యక్రమ చైర్మన్ కామేశ్వరీదేవి, స్పోర్ట్స్ చైర్మన్ మద్దూరి శంకర్, ఉపాధ్యక్షుడు ఎం.వెంకన్నబాబు, డైరెక్టర్లు కార్తీక్, వంశీ, శాయమ్, సంతోష్, ఫణీంద్ర పాల్గొన్నారు.

ఇద్దరు టీడీపీ కార్యకర్తల అరెస్టు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటకు చెందిన ఇద్దరు టీడీపీ కార్యర్తలను పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. గ్రామంలో రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ నాగబాబు తదితరుల కాన్వాయ్ కంటే ముందుగా వెళ్తున్న తనను శనివారం మధ్యాహ్నం దుర్భాషలాడడంతో పాటు తన మోటార్‌సైకిల్ అద్దాలను చినజగ్గంపేటకు చెందిన శీరం అప్పారావు, మరో వ్యక్తి పగులకొట్టారని వన్నెపూడి గ్రామానికి చెందిన జనసేన నేత మొయిళ్ల నాగబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే సంఘటనకు సంబంధించి జనసేన నాయకుడిని అడ్డుకున్న వారిని నియంత్రిస్తుండగా తన విధులకు ఆటంకం కల్పించారని అప్పారావుతో పాటు రాంబాబుపై పిఠాపురం రూరల్ ఎస్ఐ జానీబాషా గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై వేర్వేరుగా కేసులు నమోదు చేసిన పోలీసులు టీడీపీ కార్యకర్తలు శీరం అప్పారావు, రాంబాబుఅలియాస్‌రామును అరెస్టు చేశారు.

అమలాపురంలో

బాలిక కిడ్నాప్ కలకలం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం శివారు కొంకాపల్లి ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికను కారులో వచ్చిన ఐదుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుకెళ్తుండగా చాకచక్యంగా తప్పించుకుని బయటపడ్డ ఘటనపై అమలాపురం పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి దర్యాప్తు చేపట్టారు. కొంకాపల్లికి చెందిన బాలిక మూడో తరగతి చదువుతుంది. ట్యూషన్‌కు వెళ్లి ఆదివారం సాయంత్రం తిరిగి వస్తూ స్థానికంగా ఉన్న గణపతి ఆలయం వద్ద దండం పెట్టుకుంటుండగా కారులో వచ్చిన ఐదుగురు వ్యక్తులు తనను కిడ్నాప్ చేసి తీసుకుపోయారని బాలిక పోలీసులకు వివరించింది. అమలాపురం బస్టాండు సెంటర్‌కు సమీపంలోని శుభకలశం ప్రాంతానికి వచ్చేసరికి కారు డోరు పక్కన ఉన్న వ్యక్తి చెయి కొరికి బయటపడినట్టు చెప్పింది. తండ్రి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తుండడంతో బాలిక డిపోకు చేరుకుంది. అక్కడ తండ్రి గురించి ఆరా తీయగా విశాఖపట్నం డ్రైవర్‌గా వెళ్లినట్టు చెప్పి అతడికి సమాచారం అందించారు. దాంతో హైరానా పడ్డ డ్రైవర్ వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. వారంతా పట్టణ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. బాలికను పట్టణ సీఐ పి.వీరబాబు విచారిస్తున్నారు. ఈ ఘటనపై సీసీ కెమెరాల ద్వారా విచారణ చేస్తామని తెలిపారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

జై శ్రీరామ్



కడియం మండలం కడియపు లంక వడ్డి కింద రామాలయం వద్ద స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



ధవళేశ్వరం బ్యారేజ్ కాలనీ రామాలయంలో కల్యాణోత్సవం

- ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- రామాలయాల్లో ప్రత్యేక పూజలు
- వైభవంగా సీతారాముల కల్యాణాలు
- పానకం, వడపప్పు ప్రసాదం పంపిణీ
- పలుచోట్ల అన్నసమారాధనలు

ధవళేశ్వరం/గోకవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలను ఆదివారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించి పానకం, వడపప్పు ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణాలను చలువ పందిళ్ల, విద్యుత్ దీపాలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల్లో భారీ అన్నప్రసాద వితరణ చేశారు. ధవళేశ్వరం బ్యారేజ్ కాలనీ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయం ఎదురుగా ఉన్న కల్యాణ వేదికపై సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండు



బీజాపురి టౌన్‌షిప్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల

వగా నిర్వహించారు. సాగి వెంకట సూర్యనారాయణ రాజు దంపతులు చేతులమీదుగా రుత్వికులు కల్యాణ మహోత్సవాన్ని చేయించారు. అనంతరం శ్రీరామహోమం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఎర్రకొండ కోదండ రామాలయం కొత్తూరు వారి వీధి రామాలయం, గొల్లపేట రామాలయం, కోరికాల్వ సెంటర్ రామాలయం, రథం వీధి గడియార స్తంభం వద్ద ఉన్న రామాలయం, యడ్ల వారి రామాలయం, జంగాల వీధి రామాలయం తదితర ఆలయాల వద్ద సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఎర్రకొండ వద్ద రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 3వేల మంది భక్తులకు మహాన్నదానం జరిపారు.



పాతతుంగపాడులో సీతారాముల కల్యాణానికి హాజరైన బీవీఆర్ చౌదరి

కార్యక్రమంలో సావాడ శ్రీనివాసరెడ్డి, కనిశెట్టి అచ్చెంనాయుడు, వల్లిరెడ్డి సత్యనారాయణ, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక అన్నపూర్ణమ్మపేట పెద్ద వీధిలో ది రాజమండ్రి నాయీ బ్రహ్మణ సేవా సంఘం, నాయీ బ్రాహ్మణ రామభవన సంఘం ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సింగంపల్లి సత్యనారాయణ, సుశీల, శీర నాగేశ్వరరావు, మల్లేశ్వరి దంపతుల చేతులమీదుగా పురోహితులు కల్యాణ జరిగించారు. గోపాల్‌నగర్ రామాలయం సెంటర్లోని శ్రీ సీతారాముల ఆలయానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నాయకులు బొమ్ముల దత్తు, నర్సిపల్లి నీహారిక, రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణ, కందికొండ రమేష్ విచ్చేసి స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లోని మాజీ ఎంపీ కార్యాలయంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, మోనా దంపతుల ఆధ్వర్యంలో సీరారాముల కల్యాణంజరిగింది. రాష్ట్ర బీసీ నాయకుడు మార్గాని నాగేశ్వరరావు, ప్రసూన్ దంపతులు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజి చైర్మన్ గన్ని భాస్కరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, అశోక్‌కుమార్ జైన్, రమేష్ హేమ్‌దేవ్ తదితరులు విచ్చేసి భరత్ దంపతులను ఆశీర్వదించారు.

కడియం: వీరవరంలో అతిపురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. మంత్రి కందుల దుర్గేష్ స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ వేద ఆశీర్వాచనాలు అందించి ఘనంగా స్వాగతించింది. కూటమి నాయకులు సత్కరించారు. స్వామి వారి కల్యాణం అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం వైభవంగా సాగింది. కడియపులంకలో వడ్డి కింద రామాలయం వద్ద సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. నర్సరీ రైతు ఈలి శ్రీకృష్ణనారాయణ(బేబీ)-లక్ష్మి దంపతుల చేతులమీదుగా కల్యాణాన్ని జరిపించారు. మంత్రి దుర్గేష్ విచ్చేసి సీతారాములకు పూజలు చేశారు. కల్యాణ కర్తలను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు, నర్సరీరైతులు పాల్గొన్నారు. అనంతరం ఈలి శ్రీకృష్ణనారాయణ స్వీయనిధులతో భోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని వేమగిరి, బుర్రిలంక, పొట్టిలంక, దామిరెడ్డిపల్లి, దుళ్ల, మురమండ, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు, కడియపుసావరం గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద ప్రసాదాల వితరణ, పానకాల పంపిణీతోపాటు పలుచోట్ల అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలోని పద్మశాలీల, తాతానగర్, నంది, చెరువువీధి, కాలువవీధి రామాలయాల్లో సీతారాములను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి తదితరులున్నారు. బిక్కవోలులోని రావిచెట్టు సెంటర్‌లోని రామాలయంలో యాయన మహేశ్వరరావు దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించి సీతారాముల కల్యాణం జరిపించారు. ఊలపల్లి రోడ్డులోని రామాలయంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జేవీవీ సుబ్బారెడ్డి పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. పంచాయతీ వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం జరిపారు. ఈ సందర్భంగా అన్ని ఆలయాల వద్ద అన్నదాన ఏర్పాట్లు చేశారు. పందలపాక రెడ్ల రామాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. కొంకుదురు ధ్వజ స్తంభం వద్ద రామాలయంలో పడాల ఫణిశంకర్‌రెడ్డి లక్ష్మీదుర్గ దంపతులు కర్తలుగా వ్యవహరించి సీతారాముల కల్యాణం జరిపారు. అనంతరం అన్నప్రసాదాన్ని అందించారు.



బలభద్రపురంలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని జాంపేట పోలీస్ క్వార్టర్స్‌లో శ్రీకోదండ రామాలయంతో పాటు తిలక్‌రోడ్డు, ఏపీఏ రోడ్డు, మెయిన్ రోడ్డు, సీతంపేట తదితర 29 ప్రాంతాల్లో రామాలయాల వద్ద జరిగిన శ్రీరామ నవమి వేడుకలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మాన్ని రక్షించడంలో గాని, పితృవాక్పాలనలో గాని, భార్య కోసం చేసిన ధర్మయుద్ధంలో గాని, తమ్ముడి కోసం త్యాగం చేయ్యడంలో గాని శ్రీరామచంద్రుడు జీవితం అందరికి ఆదర్శమన్నారు. ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలన్నారు. ఇక శ్రీరామనవమి పండగలో పోలీస్ క్వార్టర్స్‌లో జరిగిన వేడుకలో బెల్లం పానకం తయారీకి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వీరరాఘవమ్మ దంపతులు 100 కేజీల బెల్లం పంపించారు. అలాగే తిలక్‌రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్ద జరిగిన వేడుకలకు వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. వారి కుమార్తె అపర్ణ భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువు, స్థానిక బీజాపురి టౌన్ షిప్‌లలో జరిగిన శ్రీరామ నవమి వేడుకలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీజాపురి టౌన్‌షిప్‌లో అన్నదానం జరిగింది. అలాగే దివాన్‌చెరువు, పాతతుంగపాడు గ్రామాల్లో జరిగిన సీతారాముల కల్యాణోత్సవాలకు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమాల్లో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని రామవరంలో మూలారెడ్డి సత్యవతి కాలనీలో రామాలయంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి సమేఘరెడ్డి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, మూలారెడ్డి సతీమణి సత్యవతి కళ్యాణాన్ని తిలకించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనపర్తి పంచాయతీ రామాలయంలో మల్లిడి శ్రీరామ్ దంపతులు, మహేంద్రవాడలోని గుడిమెట్ల వారి రామాలయంలో కర్రి శ్రీనివాసరెడ్డి శ్రీలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయాల వద్ద పానకం, వడపప్పు పంపిణీ చేశారు. సాయంత్రం సీతారాముల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలు చోట్ల అన్నసమారాధనలు జరిపారు.



కల్యాణంలో పాల్గొన్న ఎస్పీ కిశోర్ దంపతులు, ఎమ్మెల్యే వాసు

రాజానగరం: రాజానగరంలోని చెరువుగట్టు రామాలయం, అగ్రహారం, కంచుపట్లవారి రామాలయం, తూర్పుగోనగూడెం, కలవచర్ల,సీతారాంపురం, నరేంద్రపురం, వెలుగుబంద, శ్రీరామపురం, శ్రీకృష్ణపట్నం, భూపాలపట్నం తదితర గ్రామాల్లో సీతారాముల కళ్యాణం వేదమంత్రాలు, మంగళవాయుద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం ఆలయాల వద్ద పానకం పంపిణీ చేశారు. పలుచోట్ల అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొని సీతారాముల పెళ్లిని కనులారా వీక్షించారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని పిడింగొయ్యి, బొమ్మూరు, హుంకుంపేట, తొర్రేడు, రాజవోలు, కాతేరు, వెంకటనగరం, శాటిలైట్ సిటీ గ్రామాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయాల వద్ద ప్రసాద వితరణ, పానకాలు పంపిణీ, పలు ఆలయాలు వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

సీతానగరం: మండలంలోని రామదుర్గం కొండపై జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి బీజేపీ నాయకుడు ఏపీఆర్ చౌదరి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ చారిత్రాత్మకమైన 13వ శతాబ్దం నాటి గిరిదుర్గం ప్రస్తుతం రామదుర్గం కొండగా భాసిల్లుతోందని ఈ ప్రదేశం సమీపంలో పోలవరం ప్రాజెక్టుతో పాటు విద్యుత్ తయారీ కేంద్రం ఏర్పడుతున్నందున ఈ ప్రదేశాన్ని ట్యూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అనంతరం కొండ పైభాగంలో ఉన్న కోనేరును పరిశీలించారు. ముందుగా సీతారాముల కళ్యాణ వేడుకలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే రఘుదేవపురంలో జరిగిన శ్రీరామనవమి వేడుకలకు టీడీపీ నాయకుడు పెందుర్తి అభిరామ్, పురుషోత్తపట్నంలో జరిగిన వేడులకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో సీతారాముల కల్యాణోత్సవ దృశ్యం

బీజేపీకి 180 మిలియన్ల సభ్యత్వాలు

- రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి
- భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలు



నరేంద్రపురంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన పురందేశ్వరి

రాజానగరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే 180 మిలియన్ల సభ్యత్వం ఉన్న పార్టీగా బీజేపీ అభివృద్ధి చెందిందని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలను పలుచోట్ల ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజానగరం మండలం నరేంద్రపురంలో పార్టీ పతాకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. మండలాధ్యక్షుడు ఆళ్ల శివనాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పురందేశ్వరి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ దేశాల చెంతన భారత్‌ను నిలిపిన ప్రధాని మోదీ విశ్వనాయకుడిగా నిలబడ్డారన్నారు. బీజేపీ ఆవిర్భావాన్ని వివరించారు. అనంతరం పాతవెలుగుబందలో శ్రీరామ కల్యాణాన్ని కొద్దిసేపు తిలకించారు. ఆ తర్వాత కొత్తవెలుగుబంద లో కొంతమందికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కంబాల శ్రీనివాసరావు, అడబాల గణపతి, మోది సత్తిబాబు, బిక్కిన కామరాజుచౌదరి, అబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో పార్టీ పతాకాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించి స్వీట్లు పంచారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుంది కేంద్రంలోని బీజేపీ సర్కారేనని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్ సరెళ్ల సుమలత, నియోజకవర్గ కన్వీనర్ ఎం.శివరామకృష్ణంరాజు, దుర్గారెడ్డి, తొండాపు శాంతిశ్రీలక్ష్మి, పడాల వెంకటరామారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, బండారు శివ, అమ్మిరెడ్డి, సింహాచలం పాల్గొన్నారు.

అనపర్తి: రామవరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీ జెండాను ఎగురవేసి కార్యకర్తలకు, నాయకులకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో సుపరిపాలన అందించగల ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలోనే అత్యధిక ప్రజాదరణ పొందిన పార్టీగా అవతరించిందన్నారు. కార్యక్రమంలో శివరామకృష్ణంరాజు, కర్రి బులిరెడ్డి, చింతా సురేష్‌రెడ్డి, మల్లిడి సురేంద్రరెడ్డి, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, కుతుకులూరు సర్పంచ్ గొల్లు హేమతులసి, రామవరం సర్పంచ్ గిరిడా గంగాభవాని పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని సింగంపల్లి, దొడ్డిగుంట, సుభద్రంపేట, వెంకటాపురం, రంగంపేట గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు మైలవరపు సాయిరామ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఎగుర వేశారు. అనంతరం స్వీట్స్ పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శివరామకృష్ణరాజు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు గ్రామ గ్రామాన చేరే విధంగా ప్రచారం చేయాలని, బూత్ స్థాయిలో పార్టీ మరింత బలోపేతం చేయాలన్నారు. రామ మందిర్ నిర్మాణం, ఆర్టికల్ 370, వక్ఫ్‌బోర్డు బిల్లు వంటి చారిత్రాత్మక పనులు బీజేపీ వల్లే సాధ్యమయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, మండవిల్లి గుప్త, ఆంజనేయులు, పోతుల వీరసుందరావు, పెండ్యాల బుజ్జిబాబు, గుత్తుల సుబ్రహ్మణ్యం, కొండేపూడి నాని, వారా అమృతప్రసాద్ పాల్గొన్నారు.

గోకవరం: గోకవరంలోని బీజేపీ కార్యాలయం వద్ద 70 అడుగుల ఎత్తులో ఏర్పాటుచేసిన పార్టీ జెండాను ఆ పార్టీ నాయకుడు, విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో దేశం అన్నివిధాలా అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మట్టా మంగరాజు, ఉంగరాల ఆదివిష్ణు, బత్తుల వెంకన్నబాబు, ముప్పిడి నాగేశ్వరారవు, ఆదం మణికంఠ, ముక్కా శ్రీను, వేగి దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.



గోకవరంలో బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న పార్టీ నాయకులు



బిక్కవోలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 20శాతం కూడా అందలేదు

పోలవరం నిర్వాసితుల కాంగ్రెస్ పార్టీ అధ్యయన కమిటీ చైర్మన్ మార్టిన్ లూథర్



సమావేశంలో మాట్లాడుతున్న మార్టిన్ లూథర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు 20శాతం కూడా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు చెల్లించలేదని పోలవరం నిర్వాసితుల కాంగ్రెస్ పార్టీ అధ్యాయన కమిటీ చైర్మన్ మార్టిన్ లూథర్ అన్నారు. రాజమహేంద్రవరంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికే జీవనాడిగా ఉన్న ప్రాజెక్టుకు జీవం పోయాల్సిన పాలకులు జీవాన్ని తీసేస్తున్నారన్నారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే 78వేల కుటుంబాల నిర్వాసితులు నష్టపోతారన్నారు. ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్ల నుంచి 41.15కి తగ్గించడం వల్ల 194 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం నుంచి 114 టీఎంసీలకు పరిమితం చేసి ప్రాజెక్టు స్వరూపాన్ని పూర్తిగా మార్చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర జీవనాడిగా ఉండేలా కేంద్రం వేగంగా చర్యలు తీసుకునేలా రాష్ట్రంలోని ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ప్రాజెక్టును అతి త్వరలో తమ కమిటీ పరిశీలన చేస్తుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా 22లక్షల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరణకు, 8లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగు నీరు అందించే లక్ష్యం కలిగిన మహానేత వైఎస్ఆర్ ఆశయానికి తూట్లు పడుతున్నాయన్నారు. గతంలో చంద్రబాబు, జగన్ చేసిన పొరపాట్ల వల్ల ప్రాజెక్టు ఎగువ కాపర్ డ్యాం, డయాఫ్రంవాల్ కొట్టుకుపోయాయని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.30 వేల కోట్ల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సరిపోతుందన్నారు. త్వరలో ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జలశక్తి మంత్రిని కలిసి సమస్యలను పూర్తిగా వివరిస్తామన్నారు. సమావేశంలో నాయకులు డాక్టర్ వడయార్, అబ్దుల్లా షరీఫ్, డాక్టర్ వడయార్ శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎం.శారద, నిడదవోలు కోఆర్డినేటర్ కారంగి వెంకటేశ్వరరావు, మహ్మద్ ఫసల్ బేగ్, తాడాల కొండ రాజు, మేడవరపు బలగం దొర పాల్గొన్నారు.

ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు కూల్చేస్తున్నారు

పలువురు భూయజమానుల ఆరోపణ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి):దివాన్‌చెరువులో ఫ్లైఓవర్ నిర్మాణానికి చేసిన భూసేకరణ మార్కింగ్ కంటే ఎక్కువ విస్తీర్ణంలో కట్టడాలు కూల్చివేస్తున్నారంటూ కొంతమంది భూయజమానులు ఆరోపిస్తున్నారు. ఈ ఫ్లైఓవర్ నిమిత్తం దాదాపు ఆరు సంవత్సరాలు క్రితం దివాన్‌చెరువులో భూమిని సేకరించారు. నిర్మాణాలు కూల్చివేతను ఇటీవల ప్రారంభించారు. అయితే తమ వద్ద సేకరించి మార్కింగ్ ఇచ్చిన దాని కంటే ఎక్కువ విస్తీర్ణంలో కూల్చివేతలు చేస్తున్నారంటూ కొందరు యజమానులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించి న్యాయం చేయాలని వారు కోరారు. దీంతో జాతీయ రహదారుల సంస్థ పీడీ సురేంద్రనాథ్ ఆర్డీవో దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు సమస్య పరిష్కారం నిమిత్తం సర్వేయర్లు సోమవారం దివాన్‌చెరువు వస్తారని తహశీల్దార్ జీఎస్ఎల్ దేవి తెలిపారు.

గణపతి ఆలయ వార్షికోత్సవం

రంగంపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రంగంపేటలోని మంచినీటి చెరువు వద్ద కొలువైన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామి వారికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 3 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బైక్ అదుపుతప్పి వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం డీమార్టు వద్ద ప్రమాదం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం క్వారీ సెంటర్ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడి తలకు తీవ్రగాయమై ఒక వ్యక్తి మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం క్వారీ ప్రాంతం సుబ్బారావునగర్‌కు చెందిన ఎం.సుబ్బారావు(62) బైక్‌పై ఆదివారం రామదాసుపేట వైపు నుంచి వస్తూ డీమార్టు సమీపంలోని రోడ్డు డివైడర్ మలుపు వద్ద టర్నింగ్ తిరుగుతుండగా బైక్ అదుపుతప్పి పడిపోయాడు.ఈ సంఘటనలో సుబ్బారావు తలకు తీవ్రగాయలయ్యాయి. దీంతో అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: రాబిన్‌హుడ్
సూర్యమినీ	: ఏ మైన్ క్రాఫ్ట్ మూవీ
సూర్యప్యాలస్	: ఆర్య-2
స్వామి	: కోర్ట్
శివజ్యోతి	: రాబిన్‌హుడ్
అనుశ్రీ(సాయికృష్ణ)	: వీర ధీర శూర
రాజా	: ----
ఊర్వశి	: ఎల్2 ఎంపురాన్
రంభ	: శారీ
మేనక	:28సి
అప్సర	: మ్యాడ్ స్క్వేర్
కుమారి	: ఆర్య-2
అశోక	: మ్యాడ్ స్క్వేర్
వీఎస్ మహల్(నామవరం)	: మ్యాడ్ స్క్వేర్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: మ్యాడ్ స్క్వేర్
వెంకటసూర్య(కడియం)	: మ్యాడ్ స్క్వేర్
సత్యగౌరి (అనపర్తి)	: వృషభ, శివాజ్ఞ
సూర్యశ్రీ (అనపర్తి)	: మ్యాడ్ స్క్వేర్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: ఆర్య-2
రామకృష్ణ(కోరుకొండ)	: ----
గీతాసినిమాస్ (సీతానగరం)	: ----
శ్రీనివాస (గోకవరం)	: దిల్‌రూబా
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కోర్ట్
లలితామహల్(రంపచోడవరం)	: ---
నవయుగ(చింతూరు)	: ----

శోభాయమానం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా జరుపుతున్న శోభాయాత్రలో భాగంగా ఆదివారం స్థానిక పుష్కర్ ఘాట్ నుంచి చేపట్టిన యాత్ర కోలాహలంగా సాగింది. పలువురు యువకులు కాషాయ దుస్తులు ధరించి, కపిరాజుతో ఉన్న జెండాలను చేతబూని మోటార్ సైకిళ్లపై రివ్వున ఎగిరారు. హిందువులందరూ నిత్యం చైతన్యవంతంగా ఉండాలని కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన స్వామి విరజానంద, అఖిల భారత ధర్మజాగరణ ప్రముఖ్, ఆలే కుమార్ పిలుపు నిచ్చారు. కార్యక్రమాలనికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ తదితరులు విచ్చేశారు.
















ఆంధ్రా భద్రాద్రిలో వైభవంగా..

ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచిన కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లలమామిడాడ కోదండరామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఆదివారం వైభవంగా సాగాయి.. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.. జైశ్రీరామ్ నినాదాలతో ఆలయం మార్మోగింది.. సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. స్వామి అమ్మవార్లకు కలెక్టర్ షన్‌మోహన్, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.





సంప్రదాయ దుస్తుల్లో ఎస్పీ దంపతులు



రాజమండ్రి సీతంపేట రామాలయంలో సీతారాముల కల్యాణం



మంత్రిగారూ.. మారారు : పంచెకట్టులో మంత్రి దుర్గేష్



ఊరూరా రాములోరి.. కల్యాణం

కడియం మండలం వీరవరంలో పూజలు

జిల్లా వ్యాప్తంగా రాములోరి కల్యాణం ఘనంగా సాగింది.. ఊరూవాడా రామాలయాల వద్ద ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా సాగింది. రాజమహేంద్రవరం జాంపేట రిజర్వ్ పోలీస్ లైన్ కోదండ రామాలయంలో జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ లావణ్య దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. ఎస్పీ మాతృమూర్తి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్‌బీ సీఐ ఏ.శ్రీనివాసరావు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.ర ఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయి మహేష్, జి.వెంకటేశ్వరరావు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. - రాజమహేంద్రవరం సిటీ

సీసీ.. చూసీ!



కేసుల ఛేదనలో బ్రహ్మాస్త్రం..సీసీ కెమెరాలు

- చూస్తున్నాయ్.. కనిపెట్టేస్తున్నాయ్
- అయినా ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం
- సర్కారుకు సీసీ కెమెరాలు కరువు
- ఉమ్మడి జిల్లాలో సుమారు 1520
- ఎక్కడికక్కడ పాడైపోతున్న వైనం
- ప్రైవేటు సీసీ కెమెరాలపైనే ఆధారం
- జాతీయ రహదారిలో దారుణం
- జొన్నాడ టూ అన్నవరం 121
- మరిన్ని ఏర్పాటుకు డిమాండ్

గత నెల 24న జరిగిన పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి ఎన్నో సంచనాలకు వేదికైంది.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది..ఆ ఘటనకు సీసీ కెమెరాలే దాదాపుగా చెక్ పెట్టాయి.ఆయన అదే రోజు హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై సుమారు 400 కిలోమీటర్లు పైనే ప్రయాణించారు. ఆ ఘటనపై క్రైస్తవులంతా ఏకమయ్యారు. పాస్టర్‌ను హత్య చేశారంటూ గొంతెత్తారు.. ఎవరికి వారు రకరకాల వాదనలు వినిపించారు. పోలీసులు దర్యాప్తు ఆరంభించారు.. సీసీ అస్త్రం బయటకు తీశారు.. ఆయన ప్రయాణించిన దారిలో సుమారు 300 సీసీ కెమెరాలు పరిశీలించారు.. ఏం జరిగిందో చెప్పడానికి ప్రయత్నించారు. అల్లర్లను చల్లార్చారు. అసలు సీసీ కెమెరాలే లేకపోతే దర్యాప్తు ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడని పరిస్థితి ఉండేది. నిఘా నేత్రాల వల్ల ఆ కేసులో దాదాపుగా చిక్కుముళ్లు వీడినట్టు సమాచారం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సీసీ కెమెరాల ఏర్పాటులో ఇటు యంత్రాంగం, అటు జనంలోనూ అలసత్వం కనబడుతోంది. సర్కారు వారి కెమెరాలను రకరకాల దోషాలు పట్టిపీడిస్తుంటే.. ప్రజలు వాటిని ఏర్పాటు చేసుకోవడంపై విముఖత చూపుతున్నారు.



చిల్లకల్లు వద్ద రోడ్డుపై పడిపోయిన ప్రవీణ్ (ఫైల్)

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ/క్రైం-ఆంధ్రజ్యోతి)

సవాలక్ష సమస్యల పరిష్కారంలో కీలక భూమిక వహిస్తున్నది 'నిఘా' నేత్రమే. నేరాల దర్యాప్తు, నియంత్రణలో మూడో కన్ను అత్యంత కీలకంగా మారింది.అధిక దర్యాప్తులు సీసీ కెమెరాల ఆధారంగానే ఓ కొలిక్కి వస్తున్నాయి. పలు కీలకమైన కేసుల్లో సీసీ కెమెరాల పుటేజీలు లభ్యత వల్ల ఏళ్ల పాటు సాగాల్సిన దర్యాప్తులు వేగంగా జరిగి నేరస్తులను జైలుకు పంపిస్తున్నాయి. నేర నియంత్రణలో సీసీ కెమెరా పుటేజీలు కీలకంగా ఉన్నా ఏర్పాటులో కరువు కనబడుతోంది.తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో కనీసం 5 వేల కుపైనే సీసీ కెమెరాలు ఉండాలి. మరో రెండేళ్లలో పుష్కరాలు రానున్నాయి.కానీ ప్రస్తుతం 375 కెమెరాలు ఉండగా..కేవలం 185 పనిచేస్తున్నాయి. అధికారికంగా 480 కెమెరాలు ఉన్నాయని లెక్క చెబుతున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 150 సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిలో 15 కెమెరాలు సాంకేతిక ఇబ్బందుల వల్ల పనిచేయడం లేదు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌లో 10 మంది సిబ్బంది షిఫ్టుల వారీగా పనిచేస్తూ ఈ కెమెరాల పుటేజీని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నగరంలో ప్రస్తుతం 320 సర్కారు కెమెరాలు మాత్రమే విధుల్లో ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పోలీసు యంత్రాంగం ఎన్నో కీలకమైన కేసులను ఛేదించింది. కోనసీమ జిల్లా పరిధిలో పోలీసుల రికార్డుల ప్రకారం 2వేలకు పైనే సీసీ కెమెరాలు ఉన్నాయి. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 3,622 సీసీ, పీటీజెడ్ కెమెరాలు ఉన్నాయి. జిల్లా పోలీస్‌శాఖకు సంబంధించి 540 సీసీ, పీటీజెడ్ కెమెరాలుండగా పోలీస్‌శాఖ 16 డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసింది. ఈ కెమెరాలు నిరంతరాయం పని చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 10 వేల సీసీ కెమెరాలు ఏర్పా టు చేస్తే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావు లేకుండా జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని రూపొందించవచ్చని ఎస్పీ బింధుమాధవ్ ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సంఘటన జరిగిన సమయంలో ప్రైవేటు కెమెరాలపై ఆధారపడాల్సి వస్తోంది.శివారు, సమ స్యాత్మక ప్రాంతాల్లో నిఘానేత్రాలు మసక బారిపోయాయి.

పోలీస్ కెమెరాలకు మ్యాట్రిక్స్

పోలీస్ సీసీ కెమెరాలను మ్యాట్రిక్స్ సంస్థకు అప్పగించారు. కెమెరాల ఏర్పాటు, పర్యవేక్షణ, మరమ్మతులు ఆ సంస్థ చూడాల్సి ఉంది. కానీ ఆ సంస్థ అలసత్వం వల్ల కెమెరాల పని తీరు రోజు రోజుకూ మందగిస్తోందని చెబుతున్నారు. మ్యాట్రిక్స్ సంస్థకు విజయవాడలో సర్వర్ ఉంది. సీసీ ఫుటేజీ 3 రోజుల వరకూ జిల్లా పోలీసు కార్యాలయంలో నిక్షిప్తమై ఉంటుంది.తర్వాత 28 రోజుల వరకూ మ్యాట్రిక్స్ వద్ద ఉంటుంది.మూడు రోజుల తర్వాత ఏదైనా ఫుటేజీ అవసరమైతే కెమెరా ఐపీతో లెటర్ రాసి మ్యాట్రిక్స్ వద్ద నుంచి తీసుకోవాలి. 28 రోజులు దాటితే సీసీ ఫుటేజీ ఉండదు.

హైవేపై.. సేఫ్ వేనా..

జాతీయ రహదారిపై ఎన్‌హెచ్ఏఐ పరిధిలోని సీసీ కెమెరాల ఫుటేజీ సేఫ్‌వే సంస్థ వద్ద 30 రోజుల వరకూ ఉంటుంది. ఆ గడువు ముగిస్తే ఫుటేజీ దొరకదు. ఏదైనా ప్రమాద ఘటనలు ఉంటే ఆ ఫుటేజీని జాగ్రత్త పరు స్తున్నామని చెబుతున్నారు.ఎంతో ప్రాధాన్యత ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలకు ప్రభుత్వం ఎందుకు సర్వర్లు ఏర్పాటు చేయడం లేదనేది ప్రశ్నగానే మిగులుతోంది.

హై..వే పట్టదా!

జాతీయ రహదారిపై సీసీ కెమెరాలపై తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. జాతీయ రహదారిపై కిలో మీటరుకు ఒకటి చొప్పున జొన్నాడ నుంచి రాజమహేంద్రవరం వరకూ 49, దివాన్ చెరువు నుంచి-అన్నవరం వరకూ 72 కెమెరాలు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ సేఫ్‌వే సంస్థ చూస్తోంది. అయితే హైవే మరమ్మతులు, జొన్నాడ దగ్గర జరుగుతున్న ఫ్లైఓవర్ వంటి పనులు చేస్తున్నప్పుడు వైర్లు తెగిపోవడంతో రోజుల తరబడి సమస్య వస్తోంది. జొన్నాడ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల వల్ల సుమారు 40 కెమెరాలు పని చేయడం లేదు. ఇలాంటి పరిస్థితి వల్ల ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాథమికంగా నిజ నిర్ధారణ అత్యంత కష్టంగా మారుతోంది.

కాకినాడలో సీసీసీ నిరుపయోగం..

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ నిఘా నేత్రానికి విఘాతం కలిగింది.కాకినాడ స్మార్ట్ సిటీగా ఎంపికైన తర్వాత మొదటిగా కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)ను తలపెట్టింది. కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాజెక్టు 2017లో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులు రూ.90 కోట్లతో చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 71 ప్రాంతాల్లో 350 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ బాధ్యతలను సెర్బిలైట్ సంస్థకు 2019లో అప్పగించారు. నెలకు రూ.50 లక్షల చొప్పున ఏడాదికి రూ.ఆరు కోట్లు చొప్పున ఐదేళ్ల పాటు రూ.30 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడేళ్లుగా సంస్థకు చెల్లించాల్సిన రూ.19.50 కోట్ల బిల్లుల బకాయిలు స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ చెల్లించలేదు. నిర్వహణ భారంగా మారడంతో నిర్వాహకులు అగ్రిమెంట్ మధ్యలోనే బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఈ సెంటర్‌లో 35 మంది పనిచేసేవారు. సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నిరుపయోగంగా మారింది. కార్పొరేషన్ అధికారులు కమాండ్ కంట్రోల్ సెంటర్ పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీలు చూశాయ్..పట్టించాయ్..

- రాజమహేంద్రవరంలో వరుస చైన్ స్నాచింగ్‌లతో హడలెత్తించిన దొంగోడి ఆటకు సీసీ కెమెరాలు చెక్ పెట్టాయి. రెండేళ్ల కిందట బొమ్మూరులోని ఇంట్లో నిద్రిస్తున్న ఓ వృద్ధురాలిపై యువకుడు అత్యా చారం చేశాడు.ఈ కేసులో సీసీ కెమెరాలే నేరస్తుడిని కటకటాల్లోకి నెట్టాయి.
- అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో జరిగిన భారీ దోపిడీ కేసును సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సెల్‌ఫోన్ టెక్నాలజీ, సీసీ కెమెరాల ద్వారా గుర్తించి భారీ ఎత్తున రికవరీ చేశారనడానికి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.
- 2022 నవంబర్‌లో కాకినాడ జిల్లా తునిలో టీడీపీ నాయ కుడు, మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావుపై కత్తితో దాడి చేసి బైక్‌పై ఉడాయించిన నిందితుడిని ఇంటి వద్ద ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా పట్టుకున్నారు..
- గత వైసీపీ ప్రభుత్వంలో దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని చంపి ఎమ్మెల్సీ అనంతబాబు డోర్ డెలివరీ చేసిన కేసులోనూ సీసీ కెమెరాలే కీలకంగా మారాయి. ఆ హత్యకు ముందు ఆ దళిత యువకుడిని అనంతబాబు ఎలా తీసుకువెళ్లాడో సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. వాటి ఆధారంగా కేసు వెలుగులోకి వచ్చింది.ఇలా ఒకటేమిటి నేరాలకు సంబంధించిన ఏ కేసులోనైనా సీసీ కెమెరాలే కీలకంగా మారాయి.

డీఎస్సీకి.. వేళాయె!



ఈ వారంలోనే నోటిఫికేషన్?

- విద్యాశాఖ సన్నాహాలు
- ఉమ్మడి జిల్లాలో 1278 ఖాళీలు
- నిరుద్యోగుల ఎదురుచూపులు
- ఎస్సీ వర్గీకరణతో నిలుపుదల
- రోస్టర్ పాయింట్లు వస్తే ప్రకటన

కాకినాడ రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : త్వరలోనే కొలువుల జాతర మొదలు కానుంది. ఈ వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లు రాగానే నోటిఫికేషన్ విడుదల చేయనుంది. వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే దీని కోసం కొన్ని లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ,జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఇచ్చిన ప్రధాన హామీల్లో ఇదొకటి. ప్రస్తుతం దీని అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఇప్పటికే టెట్ పూర్తి

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని విస్మరించింది.అంతకుముందు ఎన్నికల హామీల్లో ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే ఆ ఊసే మరిచింది. దీంతో నిరుద్యోగ అభ్యర్థులకు ఆ ఐదేళ్లూ ఎదురు చూపులే మిగిలాయి.2024లో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347కుపైగా ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించి ఇప్పటికే ఫలితాలు ప్రకటించింది.

ఉమ్మడి జిల్లాలో ఖాళీలివే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1,278 ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్టు సమాచారం. స్కూల్ అసి స్టెంట్లకు సంబంధించి ఆంగ్లం 90, తెలుగు 70, హిందీ 71, గణితం 55, ఫిజికల్ సైన్స్ 59, బయాలాజికల్ సైన్స్ 95, సోషల్ స్టడీస్ 114, సంస్కృతం 5,వ్యాయామ విద్య 199, ఎస్జీటీలు 349, పీజీటీ, టీజీటీ ప్రిన్సిపాల్స్ మొత్తం 171 ఖాళీలు డీఎస్సీ ద్వారా భర్తీ కానున్నట్టు తెలిసింది.మరో వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేష న్ వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఉ మ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల మం దికి పైగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

ఈ ఫలితాలు నవంబరులోనే విడుదల కావడంతో అదే నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని అభ్యర్థులంతా భావించారు. అప్పటికే చాలా మంది అభ్యర్థులు కోచింగ్ తీసుకుంటూ డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కొన్ని సాంకేతిక కారణాలు, ఎమ్మెల్సీ కోడ్ అమలుతో పాటు అభ్యర్థుల వయసు పెంపు తదితర సమస్యలపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున నోటిఫికేషన్ ప్రకటన వాయిదా పడింది. ఆ సమస్యలన్నింటినీ సరిచేసి కోడ్ ముగిసిన తర్వాత నోటిఫికేషన్ వెలువరిస్తారని ఆశించారు.ప్రస్తుతం నిరుద్యోగులకు మంచి రోజులు వచ్చాయి. తాజాగా సీఎం చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేశ్ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాల్లో ఏప్రిల్‌లోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఆ ప్రక్రియ మొత్తం జూన్ కల్లా పూర్తి చేస్తామని తెలిపారు.ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఆ దిశగా అడుగులు వేస్తుండడంతో అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

వర్గీకరణ పాయింట్లు రాగానే..

ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లు రాగానే నోటిఫికేషన్ విడుదల చేయడానికి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఆర్డినెన్స్ జారీ కాగానే సాధారణ పరిపాలన శాఖ రిజర్వేషన్లపై కొత్త రోస్టర్ విడుదల చేస్తుంది. దానికి అనుగుణంగా పోస్టులు కేటాయించి, నోటిఫికేషన్ విడుదల చేస్తారు. రోస్టర్ పాయింట్లు విడుదలైన మరుసటి రోజు లేదా ఆ తర్వాత రోజు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలవుతుంది.వర్గీకరణ ప్రక్రియ దాదాపు పూర్తికావడంతో నోటిఫికేషన్‌కు మార్గం సుగమమైంది.







శోభాయాత్రలో జనవాహిని.. హాజరైన ఎంపి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వాసు, బత్తుల.. ప్రసంగిస్తున్న స్వామి విరజానంద

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ యథాతథం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు.ఉన్నతాధికారుల తప్పక హాజరుకావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

హిందువులు చైతన్యవంతంగా ఉండాలి

స్వామి విరజానంద - ఘనంగా శ్రీరామ శోభాయాత్ర

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : హిందువులందరూ,నిత్య చైతన్యవంతంగా ఉండాలని కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన స్వామి విరజానంద, అఖిల భారత ధర్మజాగరణ ప్రముఖ్ ఆలే కుమార్ పిలుపునిచ్చారు.శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పుష్కర్ ఘాట్ నుంచి శోభాయాత్ర కోలాహలంగా సాగింది. హిందూ సమాజం నిద్రాణం నుంచి మేల్కోవాలన్నారు. మనం అంతా సంఘటితంగా లేకపోతే ఎలాంటి ప్రమాదాలు పొంచి ఉంటాయో కొన్ని సంఘటనలు ఉదహరిస్తూ వివరించారు.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ వెయ్యేళ్ళుగా నిద్రాణంలో ఉన్న మన హిందూ జాతి ఇప్పుడిప్పుడే మేల్కొంటుందన్నారు. గడచిన వందేళ్లుగా హిందూ జాగరణకు చేస్తున్న ప్రయత్నం ఇప్పుడు మంచి ఫలితాలనిస్తుందన్నారు. శ్రీరామ శోభా యాత్ర.. జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగింది. బైక్‌లపై యువత, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. శ్రీరామ సేవా సమితి అధ్యక్షుడు పతివాడ రామరాజు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా శోభాయాత్ర జరుపుతున్నా మ న్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్య క్షురాలు,ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మె ల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి ఓలేటి సత్యనారాయణ, రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, జనసేన సిటి ఇన్‌చార్జ్ అనుశ్రీ సత్యనారాయణ, రాజమండ్రి బిజెపి కన్వీనర్ యెనుముల రంగబాబు,హీరాచంద్ జైన్, తదితరులు పాల్గొన్నారు.

211 మంది సెక్రటరీల నియామకం

గ్రేడ్-5 సెక్రటరీలకు గ్రేడ్ -4 ఉద్యోగులుగా పదోన్నతి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీల పాలన మెరుగుపడనుంది. జిల్లా వ్యాప్తంగా చాలా పంచాయతీలు ఇప్పటి వరకూ ఇన్‌చార్జిల పాలనలో కొనసాగాయి. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిన సంగతి తెలిసిందే. తెలుగుదేశం ప్రభుత్వం స్థానిక పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒక్కో పంచాయతీకి ఒక్కో సెక్రటరీ ఉండేలా ప్రయ త్నాలు ఆరంభించింది. సచివాలయ ఉద్యోగు లుగా గ్రేడ్-5 స్థాయిలో చేరిన సెక్రటరీలకు గ్రేడ్-4కు పదోన్నతి కల్పించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 211 మంది ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వడంతో పాటు వారికి వివిధ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నోడల్ ఆఫీసర్, కాకినాడ కలెక్టర్ షన్ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి వీరికి మార్చిలోనే పదోన్నతులు లభించాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. ఇటీవల వీరందరికీ పదోన్నతులు ఇచ్చి పోస్టింగ్‌లు ఇచ్చారు.వీరిలో అనేక మందిని ఏజెన్సీ గ్రామాలకు సెక్రటరీలుగా నియమించారు. కొంత మందిని తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో నియమించారు. ఇప్పటికే చాలా మంది రిలీవ్ అయ్యారు. వారంతా సోమవారం నుంచి కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరిస్తారు. కొంత మంది సోమ, మంగళవారాల్లో రిలీవ్ కానున్నారు.

ఇష్టపడిన మహిళ తనతో ఉండనందని ఆత్మహత్య?



సీతానగరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇష్టపడిన మహిళ తనతో పాటు ఉండనందని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామచంద్రపురం గ్రామానికి చెందిన వేమగిరి సునీల్ (26)కు గతంలో వివాహమైంది. మనస్పర్థలు రావడంతో భార్య సునీల్‌పై కేసు పెట్టింది. ఇదిలా ఉండగా వరుసకు మరదలైన ఒక మహిళతో పరిచయం ఏర్పడింది. శ్రీరామ నవమి నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్ నుంచి సీతానగరం చేరుకుని సునీల్‌ను కలిసింది. అనంతరం ఇరువురు కలిసి శ్రీరామనగర్‌లోని రాజుగారి గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌కు వెళ్లి ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు. తనతో పాటు ఉన్న మహిళను పర్మినెంట్‌గా ఉండిపోవాలని సునీల్ కోరాడు. ప్రస్తుతం కేసు నడుస్తోంది కదా అలా చేయడం తప్పని చెప్పి బాత్‌రూంకు వెళ్లి వచ్చే లోపు సునీల్ ఉరివేసుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న సునీల్‌ను పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు సిబ్బంది తెలిపారు. మృతుడి బంధువులు రాగానే మహిళ వెళ్లిపోయినట్టు కుటుంబీకులు తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. మృతుడికి తండ్రి అబ్బులు, తల్లి శాంతి, సోదరి స్వప్న ఉన్నారు.


బసివిరెడ్డిపేట సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఆర్డీవో రాణీసుస్మిత, ఇతరులు

కమనీయం.. రమణీయం
రాములోరి కల్యాణం


నిడదవోలు: ఉనకరమిల్లిలో సీతారామ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్

• వాడవాడలా ఘనంగా శ్రీరామనవమి
• పలుచోట్ల ప్రత్యేక పూజలు, అన్నదానాలు

కొవ్వూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో సీతారాముల కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక 8వ వార్డు పాతపేట రామాలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు గండ్రోతు కోదండ రామారావు, చిట్టిబాబు ఆధ్వర్యంలో వంగా రాజేష్, వెంకటేశ్వరి దంపతులు పీటాలపై కూర్చుని శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అలాగే 13వ వార్డు దగ్గువారి వీధి రామాలయం, మెరకవీధి రౌండ్ రామాలయం, మొక్కచింతల రామాలయం, గోష్పాదక్షేత్రంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయం, 11వ వార్డు రామాలయం, మెరకవీధి పలకల రామాలయం, ఆంధ్రా సుగర్స్ ఫ్యాక్టరీ క్లబ్, 23వ వార్డు అభయాంజనేయ స్వామి ఆలయం, సుబ్రహ్మణ్య స్నానఘట్టంలోని కోదండరామాలయం, బసివిరెడ్డిపేట అంజనేయస్వామి ఆలయం, రైల్వేస్టేషన్ వద్ద గల అంజనేయస్వామి ఆలయం, కొవ్వూరు సంస్కృత పాఠశాలలోని శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామి ఆలయం, కొవ్వూరు కోర్టు ప్రాంగణంలోని జడ్జి క్వార్టర్స్ వద్ద న్యాయగణపతి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని రాములోరి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు, చలివిడి, పులిహోర, ప్రసాదాలను పంపిణీ చేశారు. పాతపేట రామాలయం, గ్రంధి వీరభద్రస్వామి నివాసంలో, మెరకవీధి రౌండ్ రామాలయం వద్ద, ఆంధ్రాసుగర్స్ ఫ్యాక్టరీ క్లబ్‌లో శ్రీరామనవమిని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేశారు.

నిడదవోలు: ఉనకరమిల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన సీతారామ కల్యాణ మహోత్సవంలో రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శమని , ఆ స్వామి వారి కరుణకటాక్షాలతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్టు చెప్పారు. ఈయనతోపాటు జనసేన నేతలున్నారు.

పెరవలి: మండలంలోని అన్ని గ్రామాలు ఆదివారం శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, అజ్జరం, కొత్తపల్లి, నల్లాకుల వారిపాలెం, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు రామాలయాల వద్ద కల్యాణాలు జరిపారు. అనంతరం భక్తులకు పానకాల పంపిణీ, అన్నసమారాధనలు చేశారు. అలాగే శ్రీరామ నవమి వేడుకలు ప్రజల మధ్య ఐక్యతను, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కానూరులో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాలంగిలో షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద వేడుకలు నిర్వహించారు. వెలగదుర్రులో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామాలయం వద్దసీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. చివటంలో శ్రీరామనవమి సందర్భంగా అన్నసమారాధన చేశారు.

చాగల్లు: మండలంలో శ్రీరామనవమి వేడుకలు వాడవాడలా ఘనంగా జరిగాయి. స్థానిక సెంటర్‌లోని కోదండ రామాలయంలో శెట్టిబలిజ సంఘం, యువ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తలంబ్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చాగల్లు, నెలటూరులోని రామాలయాలను సందర్శించి వేడుకల్లో పాల్గొన్నారు. కొత్తపేట రామాలయం, ఊనగట్లలోని రామాలయం, బ్రాహ్మణగూడెం, చంద్రవరం, మల్లవరం, తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, కరుటూరి సతీష్, తదితరులు ఉన్నారు.

దేవరపల్లి: మండలంలో శ్రీరామనవమి సందర్భంగా అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరపల్లిలోని పల్లపువీధి రామాలయం, మెరకవీధి రామాలయం రామన్నపాలెం, గౌరీపట్నం, యర్నగూడెం, చిన్నాయిగూడెం పలు రామాలయాల్లో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. రామన్నపాలెంలో పరిమి శ్రీరామకృష్ణ దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు చలిమిడి, వడపప్పు, పానకాలు అందజేశారు.

గోపాలపురం: మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీకోదండరామ స్వామి ఆలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా కన్నులపండుగగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

తాళ్లపూడి: శ్రీరామనవమిని మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడిలోని మదన గోపాలస్వామి ఆలయంలో అర్జున్, లక్ష్మీనారాయణ, హనుమంతు మాష్టారు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అనంతం వారి సందులో సాయిబాబా ఆలయం వద్ద గోకవరపు మాణిక్యం, అనంతం రామకృష్ణ, కాపుల వీధి రామాలయంలో జె.కార్తీక్, హిమభారతి, బండారు అంజి ఆధ్వర్యంలో మైగాపులవారి వీధిలో నాయుడు పోసిబాబు, వేగేశ్వరపురం రామాలయంలో చిన్నపిల్లలు కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తిమ్మన్నపాలెం రామాలయంలో పూజాధికాలు చేసేందుకు గ్రామస్థులు చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ (శ్రీమంతుడు) దంపతులను అశ్వరథంపై నల్లజర్ల నుంచి తిమ్మన్నపాలెం వరకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చీపురుగూడెం టీడీపీ అధ్యక్షుడు చెల్లు పెద్దరామన్న, కూసంపూడి వెంకటేశ్వరరావు, చెల్లు సుబ్రహ్మణ్యం, మానికల వెంకటేశ్వరావు, సవలం రామకృష్ణ, పోలుపోయిన వెంకన్నబాబు, పదిలం నరసయ్య, బొట్టా శ్రీను, రామారావు, తదితరులు పాల్గొన్నారు.


తాళ్లపూడిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు ప్రసాదించాలి

• ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలందరికీ సుఖ సంతోషాలతోపాటు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని సీతారాములను కోరినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో శ్రీరామనవమి వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి నియోజకవర్గ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో ఎటువంటి సంక్షోభాలు లేకుండా ప్రజలకు మంచి జరగాలన్నారు. అలాగే నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడపించడానికి భగవంతుడు సహకరించాలన్నారు. అనంతరం పట్టణంలోని యానాదికాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో పూజలు చేశారు. అనంతరం మెరకవీధి రౌండ్ రామాలయం, మొక్కచింతల రామాలయం, దగ్గువారి వీధి రామాలయం, పాతపేట రామాలయం, గ్రంధి ప్రవీణ్ నివాసంలో జరిగే సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, తదితరులు పాల్గొన్నారు.


పాతపేట కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి, టీడీపీ నేతలు


నల్లజర్ల : అశ్వరథంపై వస్తున్న చీపురుగూడెం ఎంపీటీసీ దంపతులు


ఉండ్రాజవరం: వెలగదుర్రులో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


దేవరపల్లి: కల్యాణంలో కూర్చున్న పరిమి శ్రీరామ్ దంపతులు


చాగల్లులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం


కొవ్వూరు పట్టణంలో బీజేపీ పతాకాన్ని ఎగురవేస్తున్న నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మోదీ నాయకత్వంలో మన దేశం విశ్వ వ్యాప్తంగా నిలబెట్టేందుకు మనమంతా చేయూతనివ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధా అన్నారు. బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం పట్టణంలో నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లో పరిమి రాధా పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ అనేకమంది బలిదానాలతో ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన రాజకీయ పార్టీగా బీజేపీ రూపాంతరం చెందిందన్నారు. అందువల్ల బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలన్నారు. బీవీ ముత్యాలరావు, మాట్లా వీరాంజనేయులు, తాడిమళ్ల విజయవాణి, గండ్రోతు పవన్, టీఎస్‌వీ రమణమూర్తి, కొండపల్లి రత్నసాయి, చెరుకూరి సాయిరాజు, గోపిశెట్టి శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. 1వ వార్డు చత్రపతినగర్ (రాజీవ్‌కాలనీలో) బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు: బీజేపీ ఆవిర్భావ వేడుకలను స్థానిక సెంటర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు తాళ్లూరి వరప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మద్దిపాటి సురేష్, గ్రంధి రాంబాబు, కురుటూరి జగన్, కే. నాగరాజు, డీ.లక్ష్మీనారాయణ, కాంచన సౌందర్య, మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ నాయకులు ఆదివారం నిర్వహించారు. బీజేపీ పార్టీ చేస్తున్న ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నాయకులు వివరించారు. తొలుత బీజేపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, అక్కిన గోపాల కృష్ణమూర్తి, ఆకెళ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: ప్రధాని మోదీ నాయకత్వంలో 2047 నాటికి ప్రపంచంలోనే భారతదేశం ఉన్నత స్థాయికి చేరుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని గణపతి సెంటరు వద్ద ఉన్న బీజేపీ స్థూపం వద్ద ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సుంకర నరసింహం, నీలం రామా రావు, భీమేశ్వరరావు, బలిజేపల్లి సూర్యనారాయణ మూర్తి, ముదునూరి కిషోర్ కుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.


చాగల్లు సెంటర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: పార్టీ అభివృద్ధికి సంస్థాపరంగా ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ అన్నారు. భారతీయ జనతా పార్టీ 45వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రక్కిలంకలో పార్టీ జెండాను ఎగురవేశారు. పలువురు నాయకులు పార్టీ సిద్ధాంతాలను వివరించారు. ఇమ్మని అనసూయమ్మ, శివకుమార్, ప్రసాద్, అరుణ, పి. మార్కండేయులు, లింగాచార్యులు, కలిశెట్టి సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ పురందేశ్వరి పర్యటన ఇలా...

నల్లజర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి పర్యటన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రకాశరావుపాలెం యద్దనపూడి బ్రహ్మరాజు వాటర్ ప్లాంట్ వద్దకు చేరుకుంటారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలిసి 11.30 గంటలకు ఆవపాడులో బీటీ రోడ్డు శంకుస్థాపన, తర్వాత 12 గంటలకు ప్రకాశరావుపాలెం -తెలికిచర్ల, ప్రకాశరావుపాలెం - చోడవరం గ్రామాలకు అనుసంధానంగా బీటీ రోడ్డు శంకుస్థాపన, ప్రకాశరావుపాలెంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తారు. తిరిగి 12.30 గంటలకు బ్రహ్మరాజు గెస్ట్ హౌస్‌లో భోజనం విరామం అనంతరం నియోజకవర్గంలో పలుగ్రామాల్లో పర్యటించనున్నారు.

సాయినాథునికి ఏకాదశ రుద్రాభిషేకాలు

కొవ్వూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న షిరీడ్డ సాయినాథ ఆధ్యాత్మిక కేంద్రంలో సాయిరూపధర రాఘవేత్తముని ఆవిర్భావ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. సాయినాథుని జన్మదినాన్ని, శ్రీరామనవమి ఉత్సవాన్ని పురస్కరించుకుని పండితులు పోతాప్రగడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన వలివేటి రామకృష్ణకుమార్, రామలక్ష్మి దంపతులు సాయినాథునికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం చందనోత్సవం నిర్వహించారు. నేమాని వెంకటేశ్వర శాస్త్రి వేణుగాణం అందరిని అలరించింది.


విశేష అలంకరణలో సుందర సాయినాథుడు

కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుడివాక శ్రీనివాస్, చనమల సుబ్బారావు, అడపా రాంబాబు, ద్రాక్షారపు సురేష్‌కుమార్, చలపాక గణేష్, దూసనపూడి చంద్రశేఖర్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో... నేలరాలిన మామిడికాయలు

గోపాలపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గత రెండురోజులుగా అల్పపీడన ప్రభావంతో వాతావరణ శాఖ తుఫాన్ ప్రకటన చేసింది. దీంతో శనివారం అంతంతమాత్రంగా కారుమబ్బులు కమ్మాయి. అయితే ఆదివారం ఉదయం నుంచి విపరీతమైన ఎండ కారణంగా అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. సాయంత్రం నాలుగుగంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశమంతా మేఘావృతమైంది. వర్షపు జల్లులకు తోడు ఈదురుగాలులు వీయడంతో మండలంలోని కరగపాడు, బుచ్చయ్యపాలెం గ్రామ శివారులో ఉన్న బొమ్మిన నాగరాజుకు చెందిన మామిడితోటలో కాయలు నేలరాలాయి.


1) ఈదురుగాలులతో ఊగిసలాడుతున్న కొబ్బరి చెట్లు
2) కరగపాడులో మామిడి కాయలను ఏరుతున్న రైతు బొమ్మిన నాగరాజు

కోడిపందేలపై దాడి

నల్లజర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ముసుళ్ళకుంటలో ఆదివారం కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో సీఐ వై. రాంబాబు ఆదేశాల మేరకు ఎస్‌ఐ రమేష్ ఆ శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 2,360 నగదు, కోడిపుంజును స్వాధీనం చేసుకు న్నారు. సీఐ మాట్లాడుతూ మండలంలో కోడి పందేలు, పేకాట ఆడుతున్న వారి వివరాలు తెలియజేయాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440796614 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కాపవరం సరిహద్దు పొలాల్లో..

పెరవలి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కాపవరం సరిహద్దు పొలాల్లో పేకాడుతు న్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ తన సిబ్బందితో వెళ్లి డ్రోన్ ఎగురవేశారు. దీంతో జూదరులు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించినప్పటికీ పట్టుకున్నారు. ఇందులో ఐదుగురిని అరెస్టు చేసి రూ. 4010 స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, తదితరులున్నారు.


కాపవరం వద్ద డ్రోన్‌తో నిఘా దృశ్యం

సాధారణ ప్రసవాలకు ప్రోత్సాహం

కొవ్వూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో వందశాతం సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తున్నట్టు కొవ్వూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ కె. సాయికిరణ్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలపై ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు ఆదివారం అవగాహన కల్పించారు. మూఢనమ్మకాలు, ముహూర్తాలతో శస్త్రచికిత్సలు చేయాలనడం మంచిది కాదని, అత్యవసర పరిస్థితిలో మాత్రమే సిజేరియన్ చేయాలన్నారు. సాధారణ ప్రసవాలతో తల్లులు త్వరగా కోలుకుంటారన్నారు. రెండు లేకా మూడు రోజుల్లో ఇంటికి వెళ్లిపోవచ్చునన్నారు. నవజాత శిశువుకు ఇచ్చే పాలలో రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు.

చాగల్లు సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చాగల్లు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంటర్‌లో వర్తక సంఘం అధ్యక్షుడు గ్రంధి రాంబాబు ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గత 30 సంవత్సరాలుగా చలివేంద్రాన్ని వేసవి కాలంలో ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రంను లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ పీవీ సత్యనారాయణ చేతులమీదుగా ప్రారంభించారు. శ్రీరామనవమి శుభాకాంక్షలతో పానకం ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు తాళ్లూరి వరప్రసాద్, లయన్స్ సభ్యులు దొడ్డా వెంకటరావు, వల్లిపల్లి వెంకట రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత ఏపూరి కల్యాణ్ టీమ్


విజేతగా నిలిచిన ఏపూరి కల్యాణ్ టీమ్

కొవ్వూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ పోటీల్లో ఏపూరి కల్యాణ్ టీమ్ మొదటి బహుమతిని సొంతం చేసుకున్నట్టు జగ్జీవన్‌రామ్ యూత్ సభ్యులు తెలిపారు. పెనకనమెట్టలో జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పురస్కరించుకుని గత నాలుగు రోజులుగా దిర్సిపో గోపి, సోమలక్ష్మి దంపతులు, జగ్జీవన్‌రామ్ యూత్ సంయుక్తంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మొదటి బహుమతిని ఏపూరి కల్యాణ్ టీంకు రూ. 11,111 నగదును తాడి బుల్లిరాజు, కప్‌ను దిర్శిపో గోపి, సోమాలమ్మ దంపతులు అందజేశారు. రెండో బహుమతిని పసలపూడి వివేక్ టీమ్‌కు కప్‌ను ఎంపీటీసీ పసలపూడి తాతారావు, ఉప సర్పంచ్ కొడమంచిలి వెంకట్రావులు. రూ. 8,808 తోట సూరిబాబు అందజేశారు. మూడో బహుమతిని ర్యాలీ గ్రామానికి చెందిన టీంకు కప్‌ను అచ్చుతరాయుడు, మైగాపుల బాలు, రూ. 5,505 జానపాముల సతీష్ అందజేశారు. కార్యక్రమంలో చిడిపి గుణశేఖర్, కొడమంచిలి వీర్రాజు, పూలపల్లి రవికిరణ్, పసలపూడి సోమరాజులు క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు.

గూడ్స్ రైలు ఢీకొని ఒకరి మృతి

కొవ్వూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : గూడ్స్ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్‌ఐ పి. అప్పారావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కొవ్వూరు, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ల మధ్య డౌన్ స్లో లైన్ ట్రాక్ మధ్య గుర్తుతెలియని (35) సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుని ఒంటిపై బ్లూ కలర్ జీన్స్ ఫ్యాంటు, బ్లూ కలర్ డెనిమ్ రెడీమేడ్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్ ఉన్నాయన్నారు.. మృతుని ఆచూకీ తెలిసినవారు 9490617090, 99480 10061 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్‌ఐ అప్పారావు తెలిపారు.